క్లుప్తంగా

25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

కొండమల్లేపల్లి : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న బాలికలకు, 26న బాలురకు మిర్యాలగూడ అవంతిపురం కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సంబంధిత పత్రాలతో కౌన్సిలింగ్ హాజరు కావాలని సూచించారు.

రిమాండ్‌కు తరలింపు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఈనెల 11న నయారా పెట్రోల్ బంక్ ముందు లారీతో ఆటోను ఢీ కొట్టి ఇద్దరి మృతికి కారణమైన లారీ డ్రైవర్ భూక్యా రమేశ్‌ను శనివారం అరెస్టు చేసి దేవరకొండ కోర్టులో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు. ఈ ప్రమాదంలో గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మరియ దాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ప్రెగ్లపాటుకు చెందిన మట్ర పెద్దఅంజమ్మలు మృతి చెందారు.

మచ్చ దేవేందర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి : శ్రీకృష్ణుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మచ్చ దేవేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుమలగిరి బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో శనివారం గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణుడిపై అసభ్యకరంగా, సనాతన ధర్మంపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



దేవేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన బైరం దేవేంద్ర శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో శనివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి దేవేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆలంపల్లి జానయ్య, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

మలిదశ ఉద్యమకారుల వేదిక జిల్లా కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుల జిల్లా కమిటీని శనివారం నల్లగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద సైదులు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ తాజొద్దీన్, ఉపాధ్యక్షులుగా జిల్లపల్లి ఇంద్ర, మేడి విజయ్, పోషబోయిన ఆంజనేయులు, నామిరెడ్డి నర్సింహారెడ్డి, కోశాధికారిగా నలపరాజు ఎలమంద, కార్యదర్శులుగా పురం రవి, వంగూరు వెంకటేశ్, కొండా పురుషోత్తం, మలపరాజు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరలుగా ఏరుకొండ శంకర్, పగిడిమర్రి నరేష్, ఎండీ ముజీబ్, సభ్యులుగా ఈసం వెంకటేశ్వర్లు, కాశీమల్ల యాదయ్య, కట్టా శ్రవణ్‌కుమార్, గూడూరు వెంకట్‌రెడ్డి, వంగూరు వెంకన్న, నలపరాజు సైదులు, కునుకుంట్ల నాగరాజును ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో మేధావులను గెలిపించాలి

నల్లగొండ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులను గెలిపించాల్సిన అవసరం ఉందని ధర్మ సమాజ్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్ మహారాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేధావులు తలుచుకుంటే సాధించలేనిది ఏమిలేదని, పట్టభద్రులు వేసే ఓటు దేశ ప్రగతికి ఆయుధంగా మారాలని పిలుపునిచ్చారు. దళిత బహుజన రాజ్యాధికారం సాధించాలంటే విద్యావంతులు అందరూ విజ్ఞానవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ఉమ్మడి జిల్లాల రిజినల్ ఇన్‌చార్జ్ రాంబాబు మాట్లాడుతూ.. ఉస్మానియా సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు బరిగెల దుర్గాప్రసాద్ సీరియల్ నంబర్ 11పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆయనను గెలిపించాలని కోరారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్, వెంకన్న, శంకర్, జగన్, ఎల్లయ్య, రమేష్, సైదులు, సైదాబాబు, నర్సింగ్, గాలయ్య ఉన్నారు.

పేదోడికి ప్రభుత్వ వైద్యం అందేనా!

- తిరుమలగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ఇబ్బందులు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- గత ప్రభుత్వ హయాంలో మండలానికి కేటాయించని పీహెచ్‌సీ
- ప్రస్తుత ప్రభుత్వమైనా మంజూరు చేయాలని వేడుకోలు



తిరుమలగిరి మండల కేంద్రం వ్యూ

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరి గ్రామపంచాయతీ నూతన మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు కావస్తున్నా మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. తిరుమలగిరి మండలానికి ప్రభుత్వ వైద్య సేవలు అందని దాక్షగానే మిగిలిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటైన 40 మండలాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం గతేడాది ఆమోదం తెలిపింది. కానీ తిరుమలగిరి మండలానికి మాత్రం మొండిచేయి ఎదురైంది. మారుమూల గిరిజన ప్రాంతం, అధిక సంఖ్యలో గిరిజనులే నివసిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాల్లోని ఆర్ఎంపీ డాక్టర్లు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వం ఆస్పత్రి మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

ఎవరికీ పట్టని బాధ్యత

అనుముల, పెద్దవూర, నిడమనూరు మండలాల్లోని పలు గ్రామాలను కలుపుకొని తిరుమలగిరి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఆయా మండలాల నుంచి వచ్చిన గ్రామాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేటికీ ఆ మండలాల పరిధిలోనే ఉంది. అన్ని పనులకు ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తుండగా, ఆస్పత్రి విషయంలో మాత్రం పాత మండలానికే వెళ్లాల్సి వస్తుంది. గ్రామపంచాయతీలు మండలం నుంచి విడిపోవడంతో ఆ గ్రామాల బాధ్యత తమకేమి లేదన్నట్లు వైద్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. మండలం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు దఫాలుగా మండల సర్వసభ్య సమావేశం జరిగినా ఈ శాఖ నుంచి ఏ ఒక్క అధికారి కూడా ఇప్పటి వరకు సమావేశానికి హాజరు కాకపోవడంతో వారికి బాధ్యత ఎంత ఉందో స్పష్టంగా అర్థమవుతుంది.

108 వాహనం కూడా కేటాయించలే..

పేదలకు అత్యవసర వైద్య చికిత్స అందించాలనే సంకల్పంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005 సంవత్సరంలో 108 వాహనాలను ప్రారంభించారు. ఉమ్మడి అనుముల మండలానికి ప్రభుత్వం 108 వాహనాన్ని కేటాయించినప్పటికీ కొత్తగా ఏర్పడిన తిరుమలగిరి మండలానికి ప్రత్యేక వాహనం లేకపోవడంతో ఇక్కడి ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో సుమారు 20 గ్రామాలకు పైగా మారుమూల తండాలే ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఏదైన ప్రమాదం, ఆపద వచ్చినా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాలించే. సరైన సమయానికి వాహనాలు చేరుకోవాల్సిన గమ్యానికి చేరుకోకపోవడంతో జరగరాని నష్టం జరిగిపోతుందని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మండలం నుంచి 108 వాహనం రావాలంటే పదుల కిలోమీటర్ల నుంచి రావాల్సి వస్తుందని అదే మండలానికి ప్రత్యేక 108 వాహనం ఉన్నట్లయితే ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

108 వాహనం కేటాయించాలి



నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి మండలానికి ఇప్పటి వరకు 108 వాహనాన్ని కేటాయించకపోవడం బాధాకరం. రాత్రి వేళల్లో ఏదైన ఆపద ఎదురైతే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. దీంతో సరైన సమయానికి ఆస్పత్రికి వెళ్లలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నూతన ప్రభుత్వమైనా మా బాధలను అర్థంచేసుకొని 108 వాహనాన్ని కేటాయించాలి.

– మేరావత్ భాస్కర్ నాయక్, ధన్సింగ్‌తండా

పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి



మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతుంది. నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణం. ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడంతో మారుమూల తండాల గిరిజనులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వేల రూపాయాలను ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే ఆస్పత్రిని మంజూరు చేయించాలి.

– మెండె అనీల్, బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

విద్యావంతులు ఆలోచించి ఓటు వేయాలి



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

త్రిపురారం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు ఆలోచించి ఓటు వేయాలని ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనుముల శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, పావనగుండ్ల వెంకటాచారి, అనుముల శ్యాం సుందర్ రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ దస్తగిరి, బైరం కృష్ణ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చందు, కొణకంచి తస్యం, సతీష్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

21న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఈనెల 21న పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ఈ సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కావున పట్టభద్రులందరూ పెద్ద ఎత్తున ఈ సమావేశానికి హాజరై విజతయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేసి గెలిపించేలా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కరీం, పెండ్యాల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులకు సర్టిఫికేట్ అందజేస్తున్న గ్రాండ్ మాస్టర్ కృష్ణయ్య

డిండి : ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని గ్రాండ్ కరాటే మాస్టర్ కృష్ణయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో 'జీకే మాస్టర్ షో టో ఖాన్ కరాటే డు ఇండియా' వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వలన శారీరకంగా, మానసికంగా మేలు జరుగుతుందని ఆయన విద్యార్థులకు సూచించారు. నేటి సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొవాలంటే కరాటే తప్పనిసరి అన్నారు. అనంతరం కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బెల్టులు, అర్హత పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్‌లు శివకుమార్, గోపి నాయక్,లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేశ్

మిర్యాలగూడ అర్బన్ : దేశంలో రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు సాధించాలన్న, వాటిని రక్షించాలన ఒక్క కమ్యూనిస్టు పార్టీలతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ డబ్బికార్ మల్లేశ్ అన్నారు. శనివారం మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పేలపోలు గురువయ్య మూడ వర్ధంతి కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. గురువయ్య సీపీఎంకు చేసిన సేవలు మరువలేనివి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, నాగయ్య, షేక్ జిందా, శ్రీనివాస్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సీఎంకు లేఖ రాసిన జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్రంలో పది యూనివర్సిటీలకు ప్రభుత్వం నూతన వైస్ ఛాన్సలర్‌లను నియమిస్తున్నందున ఈ నియమకాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ లేఖను పంపారు. అనంతరం సీఎంకు పంపిన లేఖను ఆయన చూపిస్తు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీలను ఇచ్చినట్లు గుర్తు చేశారు. బంధు ప్రీతి, రాజకీయ అండదండలు ఉన్నవారిని కాకుండా ఉన్నత విలువలు కలిగిన వారిని మాత్రమే నియమించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి



దేవరకొండ : వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొండమల్లేపల్లి : పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవరకొండ : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతిని దేవరకొండ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పట్టు చీరతో అలంకరించి ప్రత్యేక పూజలు చేవారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు చేదళ్ల వెంకటేశ్వర్లు, సముద్రాల ప్రభాకర్, కొత్త సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మల్లయ్య, పాండరయ్య, రమేష్, రేణుకా, జ్యోతి, దివ్య, భిక్షమయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో శనివారం అమ్మవారి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాత విగ్రహానికి అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఊరె జనార్ధన్, గౌరు వెంకటేశ్వర్లు, పాండరయ్య, బుచ్చిరాములు, విఠల్, సోమ జగన్, కుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందించాలి



చికిత్సపొందుతున్న తావూర్యను పరామర్శిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని జేత్యా తండాలో పిడుగు పడి మాలోతు తావూర్యకు చెందిన 18 గొర్రెపొట్టేళ్లు మృతి చెందాయి. దీంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి అండగా నిలవాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఉరిబండి శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం రాత్రి పడ్డ పిడుగుకు గాయపడి మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తావూర్యను ఆ సంఘం నేతలు పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉరిబండి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పిడుగు పాటుతో 18 గొర్రెలు మృతి చెందడంతో భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తావూర్య కుటుంబానికి తగిన న్యాయం చేయాలన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

చందంపేట : ఇటీవల మృతి చెందిన నేరెడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన ఎద్దు కిరణ్ కుటుంబాన్ని శనివారం పార్వతీపుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తల్లిదండ్రులు ఎద్దు దశరథం, లచ్చమ్మలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు వంగాల హరీష్‌చారి, రామకృష్ణ, శంకర్, జనార్ధన్, ఆంజనేయులు, కుంభం ఆంజనేయులు, యుగేందర్, బ్రహ్మచారి, సీతారామచారి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దవూర: మండలంలోని పెద్దవూర సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఏఈ బి.దాసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు కోదండాపూర్ 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ప్రభుత్వ నీటి సరఫరా పంపింగ్ స్టేషన్ సుంకిశాల వరకు విద్యుద్ధీకరణ పనులు చేపట్టడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీంతో 33/11 కేవీ పులిచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని అన్నీ 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పోతునూరు, పులిచర్ల, ఉట్లపల్లి, గేమ్యానాయక్‌తండా, బాసోనిబావితండా, బాసోనిబావిగేట్, జగ్‌రాంతండా, కాంసానిగూడెం, జక్కలోనిబావి, పీ.ఏ.పల్లి మండలంలోని గడ్డమీదితండా, బూడిదగట్టు, పెద్దగట్టు, ఎల్లాపురం, బాణాలకుంట గ్రామాలకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ గృహ వినియోగదారులు, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం మెయింటనెన్స్ వర్క్ జరుగుతున్నందున పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుతఏఈ హబీబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోగల నర్సాపురం, దామరచర్ల, బొత్తలపాలెం, వాచ్యతండా, దామరచర్ల ఏజియల్, శాంతినగర్, రాజాగట్టు, వాడపల్లి, గణేష్‌పహాడ్ గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూటౌన్ పరిధిలో..

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని టూ టౌన్ పరిధిలో ఎఫ్‌సీఐ, ప్రకాశ్‌నగర్, బాపూజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ లేన్ షిఫ్టింగ్‌లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : టైలరింగ్ కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండెపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాసు వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర్లు టైలరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అద్దంకి నర్సింహ, పోలె సత్యనారాయణ, రాపర్తి లక్ష్మీనారాయణ, తాడూరు సంతోష్‌కుమార్, వేణు, గోపి, శంకర్, మనోహర్ సాగర్, యాదగిరి, రాము, చారి తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. అన్నదాతల హర్షం

మాడుగులపల్లి : ఉపరితల ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలు మండలంలో ఉద్యాన పంటలకు జీవం పోశాయి. అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా మండల వ్యాప్తంగా శనివారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై సాయంత్రం జల్లు పడింది. మరో వారం పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కన్నెకల్లు, ధర్మపురం, గార్లకుంటపాలెం, గండ్రవానిగూడెం, మర్రిగూడెం తదితర గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటలు, కూరగాయలు అధికంగా సాగు చేశారు. ఏడాదిగా తీవ్ర వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నీరు సరిగ్గా రాక పంటలను రక్షించుకునేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. కొందరు ఉన్న నీటిని డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇతర పరికరాల ద్వారా అందించి కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేసినా తీవ్ర ఎండల కారణంగా చేతులెత్తేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన మోస్తరు వర్షం ఎండిపోయే దశలో ఉన్న బత్తాలు, మిరప, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలకు జీవం పోసింది. వారంరోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడం.. అడపాదడపా చిరుజల్లులు కురుస్తుండడంతో ఇక పంటలకు ఢోకా లేదని అన్నదాతలు అంటున్నారు. సాగుకు ముందస్తుగా దుక్కులను సైతం సిద్ధం చేసుకుంటున్నారు.

గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ వర్తింపజేయాలని వినతి

రామగిరి (నల్లగొండ) : అడ్వకేట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని 2019 సంవత్సరం తరువాత వచ్చిన న్యాయవాదులకు వర్తింప చేసి హెల్త్‌కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర కమిటీ ప్రతినిధి బృందం సభ్యులు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి ఈ.వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు చందాల శైలజ, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్ మక్కడ్, పి.కిషన్‌రావు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత



కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని నల గొండ రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే మూలమలుపులో కల్వర్టు కింద వెళ్లే మురుగు నీరు ప్రవహించే మార్గంలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. పాఠశాల విద్యార్థులు, స్థానికులు, వాహనదారులు వచ్చిపోయే ప్రాంతం కావడంతో ఏదైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిలిచిన 'మన ఊరు- మన బడి' పనులు

- ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.38లక్షలు మంజూరు
- పనులు ఆలస్యంగా చేపట్టడంతో నిధులు వెనక్కి
- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను కోరుతున్న గ్రామస్తులు



తరగతి గది కిటికీకి బిగించిన నాణ్యత లేని రెక్కలు



ప్రమాదకరంగా వదలేసిన విద్యుత్ తీగలు

డిండి : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ×మన ఊరు–మన బడి₹ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందులో భాగంగానే మండల పరిధిలోని గోనబోయనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.38 లక్షల వరకు మంజూరు చేసింది. పాఠశాల అప్పటి ఎస్ఎంసీ చెర్మన్‌గా ఉన్న ధర్మయ్య సకాలంలో పనులు చేపట్ట లేదు. దీంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో పాఠశాలలో చేపట్టిన పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పాఠశాలలో చేపట్టిన పనులు కూడా నాసిరకంగా చేపట్టారు.

అన్ని పనులు అంతంతే.

పాఠశాల తరగతి గదుల్లోని కొన్ని కిటికీలకు ఉన్న పాత తలుపులకు కలర్ వేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన కిటికీలు నాణ్యత లేకపోవడంతో వంగి పోవడం, విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో గోడ వెంట తీగలను ప్రమాదకరంగా వదిలేయడం, బోర్ మోటారు నుంచి వాటర్ ట్యాంక్‌కు పైప్‌లైన్ వేయకపోవడం వంటి పనులు అసంపూర్ణ దశలోనే ఉన్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ పట్టించుకోని సరిపడా నిధులు మంజూరు చేయించి పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయించాలి



మా గ్రామంలోని ఎంపీపీఎస్‌లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన పనులకు సరిపడా నిధులు మంజూరు చేయించాలి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తయ్యేలా చూడాలి .

– బర్పటి శశికళ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్

పనుల్లో నాణ్యత లేదు



'మన ఊరు మన బడి' పేరుతో గోనబోయనపల్లిలో పాఠశాలలో చేపట్టిన పనుల్లో నాణ్యత లేదు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వేసవి సెలవులు ముగిసే వరకు పనులు పూర్తయ్యేలా చూడాలి.

– బద్దెల శ్రీను, గ్రామస్తుడు